# తోడిరాగం

నాకేమిటో కొన్ని సాయంకాలాలుగా చెప్పలేని కసిగా వుంది. ఇవాళ మరీనూ. పగలల్లా ఏదో పనితో గడిచిపోతుంది. సాయంకాలం ఇదివరలోనైతే ఆయనగారు ఆఫీసునుంచి ఐదు గంటలకల్లా వచ్చేసేవారు. ఏ పార్కుకో వెళ్లి కూచునేవాళ్ళం. మరీ నెలరోజులైంది. ఈ పెద్దమనిషిగారు ఆఫీసునుంచి వెంటనే ఇంటికి రావటంలేదు. నేననేదాన్ని వున్నానో, లేదో ఆయనకెందుకు? ఇంటికి వచ్చేసరికి నేనెలాగూ యెదురు పోతానుకదా. ఖర్మ. కోపం తెచ్చుకుందా మనుకుంటాను. కోపం తెచ్చుకోలేనాయె. అథవా నటించినా విగ్రహంలాంటి ఆ పెద్దమనిషి గారికి చీమ కుట్టినట్లయినా వుండదు. ఏంచేస్తాను. మా బామ్మ అనేది 'ఎలా సరిదిద్దుకుంటావో అమ్మా, 'ఎలా చేసుకుంటావో అమ్మా' అని. ఆ, దిద్దుకున్నట్లేవుంది, సౌడభ్యం! అంత పెద్దమనిషికి అభిమాన మన్నది లేకపోతే నేనేం చేస్తాను.

చిన్నతనాన ఫిఫ్తుఫారం చదువుకునే రోజల్లో సుధాకరం అని స్నేహితుడుండేవాడు. జడ్జీగారి అబ్బాయి. ఎప్పుడూ వాళ్ళింటికి వెడుతుండేదాన్ని. ఏమిటో ఆ రోజుల పరువమే వేరు. పసితనం వదిలి వయసు వస్తున్నకొద్దీ, స్నేహం సడలి వేరువేరు ఆకర్షణలు యెక్కువవుతవి. స్నేహంకన్నా మధురమైంది యేముంది నిజానికి.

సుధాకరంతో నాకు స్నేహం చిత్రంగా కలిసింది. సుధాకరం వాళ్ళ నాన్నకు సంవత్సరం మధ్యతో బదిలీ వచ్చి మా ఊరు వచ్చారు. అప్పటికి అర్ధ సంవత్సరం పరీక్షలు కూడా దగ్గరకు వస్తున్నాయి. క్లాసులోకి మొట్టమొదట రోజు వచ్చేసరికి సుధాకరానికి

దిగులైంది పాపం. పైపెచ్చు సుధాకరానికి తగని సిగ్గు. ఏమిటో చాలా బెరుగ్గా వుండేవాడు. ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. ఆ కళ్ళల్లో ఏమిటో దిగులుండేది. సుధాకరం సగం ఆడపిల్ల అయితే నేను సగం మగపిల్లవాణ్ణి, మా ఇంట్లో నా గురించి చక్కని అభిప్రాయాలున్నాయి. మచ్చుకు మగరాయుడులాంటివి. స్కూలు ఫైనలు పాసైందాకా జామిచెట్టుమీద దోరముగ్గిన కాయలు, ఒకరి సహాయం లేకుండానే మనకు లభిస్తుండేవి. ఇంకా ఇటువంటి చాలా విషయాల్లో స్వయంపోషకత్వ ముండేది మనకు. ఆ రోజుల్లో పెద్దయినానని నలుగురూ అని ఇంట్లో కూచోబెట్టిందాకా, యెగరడం, గెంతడం మన అభిమాన విషయాలు. ఏమిటో ఆ రోజులు వొంటరిగా వున్నప్పుడు యెప్పుడేనా గుర్తువస్తే హృదయం యెంత ఆర్ద్రిమైపోతుందో చెప్పలేను. ఏమిటో చెప్పలేనిదిగులా, కాదు; ఏమని చెప్పను. ఏమిటోగా వుంటుంది ఇప్పుడుసుధాకరం ఏం ఉద్యోగం చేస్తున్నాడో, పెద్ద ఉద్యోగమే చేస్తుండవచ్చును. చక్కటి పెళ్ళాం వచ్చివుండవచ్చు. ఏ మి టో, ఏమిటో ఇప్పుడవన్నీ యెందుకు?

సుధాకరం నాకంటే కొన్ని నెలలు చిన్నట! తరువాత వాళ్ళమ్మగారు చెప్పారు. ఎలాగైనా చదువు మొదలు పెట్టడంలో నేను కొంత వెనకబడ్డాననే చెప్పాలి. ఇవ్వాళ సుధాకరం, వాళ్ల సంసారం, వాళ్ల కథ గుర్తు రావటానికి కారణం లేకపోలేదు.

అప్పుడు ఓ రోజున ముందుగా సుధాకరాన్ని నేనే పలకరించి, మేష్టారు చెప్పిన కాంపోజిషన్లూ, లెక్కలనోట్సూ ఇచ్చాను. సుధాకరం భయపడుతూనే తీసుకున్నాడు. తరువాత నాన్నగారికీ, జడ్జీ

గారికీ క్లబ్బులోని పరిచయం పురస్కరించుకుని మా స్నేహం బలపడే అవకాశం కలిగింది. ఆ రోజుల్లో సుధాకరం బక్కగా, బలహీనంగా ఉండేవాడు. పైన అప్పుడే బట్టతల అయింది. సుధాకరం చిన్నప్పుడు చాలా జబ్బుపడ్డాడుట. సుధాకరాన్ని చూస్తే, నాకు అభిమానంగా ఉండేది. జాలిగా ఉండేది. నేను ఎప్పుడూ వీలైనంతవరకు ప్రతి ఆదివారం జడ్జిగారింటికి వెళుతుండేదాన్ని. చదువుకోవటం తక్కువ. ఆడుకోవటం యెక్కువ. రింగ్ టెన్నిస్ లేకపోతే కేరమ్సూ యెప్పుడూ ఆడుతుండేవాళ్లము. వాళ్లింట్లో యెంతో ఖాళీస్థల ముండేది. సుధాకరం ఆ రోజుల్లో నన్ను సైకిలు నేర్చుకునేందుకు ప్రోత్సహించిన విషయంకూడా నేను మరిచిపోలేను. కాస్తంత అలసి పోయినట్లు కనిపించగానే బిస్కెట్లూ, టీ-ఇటువంటివి రెడీగా వుండేవి. సుధాకరానికి ప్రైవేటు మేష్టర్ని పెట్టారు. ఆదివారం సాయంకాలం ఐదుగంటలదాకా ఆడుకుని, అప్పుడు గబగబా సుధాకరం వాళ్ళ ప్రైవేటు మేష్టారు చెప్పిన లెక్కలన్నీ నోట్ బుక్‌లోకి ఎక్కించేసి ఇంటికి చేరుకునేదాన్ని.

అప్పుడప్పుడు మా నాన్న నా లెక్కల పుస్తకం తీసుకుని, తిరగవేస్తూ, తన కూతురుయొక్క బుద్ధిమంతురాలితనాన్ని లోలోపల మెచ్చుకుంటున్నట్లు, ఆ రోజుల్లో కావలసినన్ని దాఖలాలు కన్పించేవి. నిజానికి ఇందుకైనా సుధాకరానికి నేనెంతో కృతజ్ఞురాలినై ఉండవలసి వచ్చేది ఆ రోజుల్లో.

ఇవన్నీ వొకయెత్తు, సుధాకరం వాళ్ల అక్కయ్య అమృతం ప్రేమ ఒకయెత్తు. అమృతానికి నామీద అంత ప్రేమ యెందుకో నాకు తెలియదు. నేనంటే ఆమెకు యెంత అభిమానమో! ఆమె

పేరు అమృతవల్లి. ఇంటా, బయటా అందరూ అమృతమనే పిలుస్తారు. 'వారు' కూడ అలానే పిలుస్తారని తరువాత రోజుల్లో రహస్యంగా నా చెవిలో ఆమె చెప్పటం నా జన్మకు మరచిపోలేను. అమృతం చాలా అందంగా ఉండేది. ఇంట్లో ఆమెకు యెంత గారాబమో! ఎప్పుడూ మంచి మంచి చీరలు కట్టుకుంటూ వుండేది. ఎప్పుడూ ఆమె కళ్లకు కంటిఅద్దాలు ఉండేవి. అవి చలవజోడుట. నేను అవి చాలామార్లు పెట్టుకుని చూశాను, మండిపోయే యెండకూడా, ఆ జోడు పెట్టుకుంటే పున్నమినాటి వెన్నెలలా ఉండేది. వాటిఖరీదు వంద పైనేనట. అవి ఆయనగారు ఇచ్చారుట. అందుకేనేమో, ఆమె అవితీసి వొక్కక్షణంకూడా ఉండేదికాదు. ఆ జోడులోంచి ఆమె రెండుకళ్లూ, గుండ్రంగా, చక్రాల్లా తీర్చిదిద్దినట్లు, అందంగా రెండు చిన్న చందమామల్లాగా ఉండేవి.

సుధాకరం వాళ్ళఇంట్లో, అంతపెద్ద పెరట్లో వొకమూల గంగ రావిచెట్టు ఉంది. అమృతం పొద్దస్తమానం, అక్కడే ఉండేది. అమృతానికి రేగుపళ్లంటే యెంత ఇష్టమో! వాళ్లింట్లో యెంతెంత ఖరీదైన తినుబండారాలో వున్నవి. అయినా అమృతం పచ్చి రేగు కాయలే ప్రీతిగా చప్పరిస్తూ ఉండేది. ఆ రోజుల్లో నేను అనుకునే దాన్ని. వాళ్లింట్లోని బిస్కెట్లు ఇస్తే ఆరేగుచెట్టు దగ్గరకుకూడా నేను పోను అని. ఆ రేగుపళ్లు సుధాకరం కోయలేకపోయేవాడు. గోడ యెక్కి నేనే శ్రమపడేదాన్ని. మా ఇంట్లోనయితే మా అమ్మ పీపు చదునుచేసేది కాని, జడ్జీగారి భార్య లోపలనుంచి బయటకే రాదు. అందుకని అక్కడ నాకు చాలా హాయిగా వుండేది. చిత్రమైన విషయం ఏమిటంటే అమృతం వొక్కొక్కరోజు యెంతబ్రతిమా

తినా వచ్చేది కాదు. మరీ విచిత్రం, గది తలుపులు గడియ వేసుకుని, బయటకే వచ్చేది కాదు.

మనకు నెలకోసారి పండుగ. మరీ వొక్కొక్కసారి రెండు నెలలకు వస్తుంటాయి. జడ్జీగారింట్లో పదిహేనురోజుల కోసారి పండుగ. నేను మొదలు మొదలు ఆశ్చర్యపోయేదాన్ని. అసలు విషయం ఇది : అమృతం భర్త అమెరికాలో రిసెర్చి చేస్తున్నారు. వెళ్లి రెండు సంవత్సరాలైంది. ఇంకా సంవత్సరం వుండాలి. ఆయన ఉత్తరాలు వ్రాస్తుంటారు. ఆయన దగ్గరనుంచి ఉత్తరం వచ్చినప్పుడల్లా, ఇక్కడపిల్లు పండగ చేసుకుంటారు. ఆవేళ అమృతం, బయట నాతో చిన్నపిల్లలా ఆడుకోదు. ఆరోజువాళ్లింట్లో అధికంగా తింటానికి యేదైనా దొరుకుతుండేది నాకు. అయినా అమృతం కనపడనందుకు నాకు దిగులుగానే వుండేది, కొద్దిరోజుల్లోనే అమృతమంటే నాకెంత అభిమానమో చెప్పలేనంత ఇద్దరమూ కలిసి పొయ్యాము.

అలా అమెరికా నుంచి ఉత్తరం వచ్చిన ఆమ్రోజో. ఆ మర్రోజో, అమృతం నన్ను అతిప్రేమగా దగ్గరకు తీసుకునేది. ఆ ప్రేమకు నేను కరిగిపోయే దాన్ని. చెవులో చెప్పేది... "నువు పెళ్లచేసుకోకు రామా, వాళ్ళంతా మోసగాళ్ళు ఎదురుగా వుంటే నెత్తికెత్తుకునేటంత ఆర్భాటం చేస్తారు. కనుమరుగైతే అసలనుకోనే అనుకోరు. వాళమనసులో యేముంటుందో చచ్చినా, వెయ్యి జన్మలకయినా మనం కనుక్కోలేము. ఒకటి చెపుతారు, ఒకటి చేస్తారు. కాస్త ఇలా వెనక్కు తిరగ్గానే మననుచూసే నవ్వుతారు. అమ్మబాబో! యెన్ని మాయలో, ఎన్ని దొంగతనాలో..." పసితనానికి, యౌవనం వచ్చి

వీడ్కోలు చెపుతున్న ఆరోజుల్లో అమృతంసలహా అసలు నాకు రుచించేదే కాదు. అప్పుడప్పుడు కోపంకూడా వస్తుందేది. ఇలా చెపుతుందేమిటి, చచ్చుసలహాలు? ఏమన్నా అర్థం ఉండాలా! తానేమో పెళ్లిచేసుకుని కులుకుతున్నది. నాకేమో సలహా ఇది. ఇంతకన్నా చక్కగా, ఆయన తనను వోరోజు సినిమాకు తీసుకుపోతానని, తీసుకపోకుండా యెలా యేడ్పించిందీ, వాళ్ల తోడికోడళ్లలో యేమేమి పరిహాసాలు చేసి చిన్నపుచ్చిందీ, ఇంకా వోసారి పార్కులో నలుగురిముందూ, యెలా తనకు చచ్చే చావయ్యేటట్లుగా చేసిందీ, రోజూ వర్ణించి, వర్ణించి చెప్పినా వినగలను. కాని ఇటువంటి సలహా ! నా పేరు రమ. నేనేమో చక్కగానే వుంటానుట. నాన్నగారు అప్పటికే ఇంట్లో అప్పుడప్పుడు నేను సిగ్గుపడే ప్రశ్నలు వేస్తూనేవున్నారు. అలాటి సందర్భాలు తీసుకవస్తూనే వున్నారు. అమృతం అనేది "ఒకవేళ చేసుకున్నా, ఆయన్ను, యెక్కడకూ కదలనివ్వద్దు"మనం కట్టిపడేస్తే వాళ్ళు వుంటారుకాబోలు ! అయినా యీ సలహా కాస్త బాగానేవుంది. పోనీ ఇలా చెపితే సహించవచ్చును. అమృతం వున్నట్లుండి వొక్కోసారి ఆకాశంలో మధ్యాహ్న సమయాల్లో విమానం శబ్దంచేస్తూ వెళుతుంటే, ఆ విమానంకేసి చూసి, కళ్ళజోడు తీసి, చీర చెంగుతో కళ్లు వత్తుకునేది. నాకెందుకో ఆరోజుల్లో చాలా ఆశ్చర్యమయ్యేది. ఇప్పుడు తెలుస్తున్నది. ఓసారి అమృతం నా వొళ్లో తల ఆన్చి యెందుకో యేడ్చింది, చిత్రంగా నాకూ యేడుపు వచ్చింది. కాని యెందుకో అప్పుడు తెలీలేదు. ఇప్పుడు తెలుస్తుంది. అమృతంతో నాకు యెంత స్నేహమైందంటే, వాళ్లు మా ఊరినుంచి ట్రాన్సఫర్ అయి వెళ్లిపోతున్నప్పుడు, నేనూ స్టేషన్‌కు వెళ్లి, వాళ్లు యెక్కిన రైలు కదులుతున్నప్పుడు, నా సర్వ

స్వము పోయినంత దుఃఖము వచ్చి బావురుమని యేడ్చాను. స్కూలు ఫైనల్ పరీక్షలు ఇంకా మూడు నెలలు వున్నవనగా సుధాకరం వాళ్లు వెళ్లిపొయ్యారు. సుధాకరం ఆయేడు పరీక్షలకు కూర్చోనని చెప్పి వెళ్లిపొయ్యాడు. అమృతం వెళ్లిపోయింది. చలవకళ్ల జోడు పిచ్చి అమృతం ఇవాళ యెక్కడవుందో! బహుశా ఆయన అమెరికానుంచి వచ్చివుంటాడు. ఇప్పుడు పదిహేనురోజులకోసారి పండగ కాకుండా, రోజూ అమృతానికి పండగగా వుండాలని కోరుకుంటాను నేను. ఏమిటో ఇప్పుడు సుధాకరానికి కాని, అమృతానికి కాని నేను గుర్తుంటానో, గుర్తుండనో అని ఆలోచిస్తుంటాను. ఏమిటో యీ జీవితంలో మనం చిత్రంగా కలుసుకుంటుంటాం. ఒక్కొక్కరిని చూస్తే చెప్పలేని అభిమానం కలుగుతుంటుంది. వాళ్ళను గురించి ఆలోచిస్తాము. ఈ పరిచయాలు అర్థంలేనివి. అమృతం గుర్తుకువస్తే నా హృదయం అర్ద్రమైపోతుంది. ఏమిటో వెలితిగా వుంటుంది.

అమృతానికి నేను గుర్తుండాలని యేముంది? సుధాకరం యెక్కడున్నాడో!

జడ్జీగారు రిటైరైపోయి వుంటారా?

ఇవాళ అమృతం యింతగా గుర్తురావటంలో కారణం లేకపోలేదు. నాకు కొన్ని రోజులుగా, అమృతం ఆ రోజుల్లో పడిన బాధే గుర్తుకు వస్తున్నది. నాకీమధ్య కలలొస్తున్నాయి. వారికీ నాకూ మధ్య సముద్రా లున్నట్లు. దీనికి తగ్గట్టుగా ఆయన రోజూ పాడే పాట నన్ను భయపెట్టేస్తున్నది. నేను ముఖం ముడుచుకుంటే ఆయనకు సరదా. నాకు కోపంవస్తే, ఆయనకు హుషా

రుగా ఉంటుంది. ఇదేం ఖర్మ ! నా కళ్ళల్లో నీళ్లు తిరిగినా ఆయనకు దయవుండదు.

అప్పుడే పదిగంటలు కావస్తోంది. ఇంటిదగ్గర వుండేవాళ్ళ మనసు వీధిలో తిరిగేవాళ్ళకు యేంతెలుస్తుంది? వీళ్ళకు ఒక శేధ్యాస. వాళ్లు పదిమందితో మాట్లాడుతుంటారు. పది విషయాలు చూస్తుంటారు. పైన ఇప్పుడు వస్తారా ? ఇక వేళాకోళం. అర్థం పర్థం ఉండాలి

“ఇదిగో ఇవాళ వీధిలో యెంత యాక్సిడెంటు జరిగిందనుకున్నావు? క్షణంలో తప్పించుకున్నాను.”

గుండె పగిలి హడలుకొని చచ్చిపోతానా, “మరేంలేదు. మీ ఆయన్ను బల్లి యెత్తుకుని పోయింది.”

పెద్దగా ఇల్లెగిరిపోయేలా నవ్వుతూ "ఏమలా మొహం మాడ్చుక కూచున్నావు? మరి మగవాడన్న తరువాత యెన్నో పనులుంటాయి, ఎక్కడికైనా పారిపోతా ననుకున్నావా ?" ఇదీ సరుస. వారి తెలివికి వారే సంతోషించాలి. భయమట, ఒక్కత్తెనూ, బికుబిక్కుమంటూ.

ఒకరోజున ఆయనగారిని ఇంట్లోవుంచి ఐదుకల్లా వస్తానని, ఏ స్నేహితురాలి ఇంటికేగాని పోయి పది గంటలదాకా ఉంటే ధార, ధూం చెయ్యకుండా వుంటారేం? ఏం, బల్లెత్తుకుపోతుందని భయమా? వాళ్లకు తెలీదు. అమృతం చెప్పింది అప్పుడప్పుడు నిజమనే అనిపిస్తుంటుంది.

ఇవాళ గట్టిగా చెపుతాను— చెప్పదలచుకున్నవి నాలుగూ. ఎంతకూ నా కళ్లన్నీ వీధివాకిలిపైనే ఉన్నాయి. అదుగో వస్తున్నా

రులా వుంది. పదిగంటలప్పుడు, సిగ్గయినాలేదు. పెద్ద వీరునిలా, ఈల వేసుకుంటూ ఆయనగారే. ఆ అడుగుల చప్పుడుకూడా నేను గుర్తుపట్టగలను. ఏమిటా సంతోషం? పెద్ద యేదో పొడిచి గెలిచినట్లు. నాలుగురోజుల నుంచీ ఇదేవరస. నాకెంత కసిగావుందో! వస్తూవస్తూనే "తప్పైందండీ మేష్టారూ ఎక్స్యూజ్ మీ. ప్లీజ్... ఇవాళ చాలా ఆలస్యమైంది. ఇక నెప్పుడూ ఇంత ఆలస్యం..." ఆపుకోలేక నవ్వేశాను. పెద్ద, నామాట మన్నించినటు!

పొద్దు నెప్పుడో పదిగంటలకు ఇల్లు వదిలితే, యెక్కడెక్కడ తిరిగారో ముఖమంతా వాడిపోయివుంది. ఆకలైనా తెలుసుకో లేని యీాయనగారట. యీ ఉద్యోగమూ, హోదా చాలక ఫారిన్ పోతారట, ఫారిన్... ఏమైనా తెలివుండాలా! నేను పోనివ్వకేం! చాలు,ఉన్నంతలోనే హాయిగా బ్రతుకుదాం అని కాళ్లు పట్టుకుని యేడవనూ?

డ్రెస్ మార్చుకుని "ఇదుగో నీకు శుభవార్త:" నాకు భయమైంది. అప్పుడే వెళ్లి చొక్కా కాలర్లు రెండు చేతుల్తోనూ పట్టుకుని ఆయన్ను చెప్పనివ్వకుండా, "ఇదుగో పోయినరాత్రి తెల్లవారుఝూమున నాకో కల వచ్చింది. చెప్పనా?" అన్నాను.

"ఏమిటి?" అన్నారు ఆసక్తితో.

"మీరు ఎప్లయి చేసిన స్కాలర్‌షిప్ రాదుట. మీరు ఫారిన్ వెళ్లలేరుట. ఇక్కడే ఉంటారుట..." ఆయనకు కోపం.

"ఆఁ, వెనకటి కెవరో శుభం పలకరా అంటే ఏదో అన్నారుట, అలావుంది. అపశకునం మొహమూ, అపశకునపు మాటలూ. ఎప్పుడూ యేడుపే ఏంచేస్తాం? ఏమిటా దిగులు? ఇవాళ పొద్దుటు

నుంచీ మా ఆఫీసరుగారిని చచ్చి ఆరుగంటలు తోమాను. ఆయన్ను సుముఖంచేసుకునేసరికి నా తాతలు దిగివచ్చారు. కలా, గిలా సింగి నాదం, లే,లే, భలే ఆకలవుతోంది, అన్నం పెట్టండి..."

అని యీసడింపు.

నేనేం చేతునమ్మా !

దయలేదాయనకు.

ఆకాశంలో విమానం బుంయ్‌మంటూ పోతూవుంది. ఎఱ్ఱ లైటూ, పచ్చలైటూ వేసుకుని, చుక్కల్లో చుక్కలా వున్నాయి ఆ లైట్లు.

నా కళ్లనిండా నీళ్లు. ★